మాటలు గుర్తొచ్చాయి. విధి నిర్వహణ ముఖ్యం. తన మనసులోని ఆలోచనల్ని బలవంతంగా ప్రక్కకు నెట్టి తన సీట్లో కెళ్ళి కూర్చున్నాడు. తీవ్ర ప్రయత్నంమీద ఎలాగైతేనేం నోట్ రాయడం పూర్తిచేసి జవాన్ వెంకన్నతో ప్యాడ్‌ను ఆఫీసరుగారింటికి పంపాడు కుర్చీ మీదున్న కండువాతో మొహంమీది చెమట్లు తుడుచుకొని మళ్ళా ఆలోచనల్లోకి జారి పోయాడు.

అరగంట గడిచిందో లేదో వెంకన్న 'అయ్యగారో...అయ్యగారో...' అంటూ కంగారుగావచ్చి ప్యాడ్‌ని టేబుల్‌మీద పెట్టి—

'తమరర్జంటుగా ఆసుపత్రి కెళ్ళాలండయ్యా' అన్నాడు.

'ఆసుపత్రికా! ఎందుకూ!? మా ఆవిడ కబురేమైనా తెలిసిందా!?'

'అయ్యగారు సంతకాలు పెట్టాక ప్యాడ్ తీసుకొని సైకిల్‌మీద ఆసుపత్రి రోడ్డుమీదగా వస్తున్నాను. సరిగ్గా ఆసుపత్రికి అవతల చిన్నబాబాయిగారు కనబడి...!'

'ఆఁ! కనబడి ఏం చెప్పాడు?' ఆందోళనగా అడిగాడు రామనాథం.

'అమ్మగారికి పిండం అడ్డం తిరిగి పోయిందట. ఆపరేషన్ చెయ్యాలన్నారట. తమర్ని తొరగా రమ్మన్నారు.'

'పిండం అడ్డం తిరిగిపోయిందా? ఆపరేషన్ చెయ్యాలన్నారా!'

రామనాథం కుర్చీలోంచి లేచాడు. క్షణంలో ఆయనముఖం వికారంగా మారి పోయింది. వెంకన్న చెప్తూ అక్కడే నిల్చున్నాడు. రామనాథం పిచ్చిగా అటూ యిటూ తిరగటం ప్రారంభించాడు. వెంకన్న రామనాథం బాధను చూడలేక పోయాడు.

'ఈ పేదోళ్ళ కట్టాలన్నీ యిట్టాంటి బాబులకే వత్తాయి' గొణుక్కుంటూ అక్కడినుండి తప్పుకున్నాడు వెంకన్న.

రామనాథానికేమీ పాలుపోవడం లేదు. ఆపరేషన్ చేయాలన్నారు. డబ్బు కావాలి.

కొడుకు — అల్లుడు — భార్య

ఈ ముగ్గురి పరిస్థితేమిటన్న ప్రశ్న రామనాథం ముందు భయంకరంగా నిల్చుంది. రామనాథం తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. మథన పడుతున్నాడు. ఏ ఆలోచనా ఫలం చేదిగా అనిపించలేదు. హఠాత్తుగా ఆయనకు ఆఫీసు డబ్బు సంగతి గుర్తొచ్చింది. మరుక్షణంలో ఆఫీసు డబ్బే ... ఆయన గుండెలు దడదడ లాడాయి.

నిముషాలు నిష్ప్రయోజనంగా గడిచి పోతున్నాయి. బాధతో భార్య అరుస్తున్న అరుపులు ఆయన చెవుల్లో మారుమ్రోగి నట్లయింది. ఆఫీసు డబ్బు వాడుకోవడం కంటె మంచి సులభమార్గమేదీ స్ఫురించ లేదు.

మూడురోజుల్లో తన స్నేహితులొస్తారు. రాగానే డబ్బు యథాప్రకారం రెండోకంటి వాడికి తెలియకుండా ఆఫీసులో పెట్టెయ్య వచ్చును. గబగబ క్యాష్‌బుక్ తీశాడు. ఖచ్చితంగా వెయ్యిరూపాయల బాలెన్సు — ఇనుప బీరువా తాళం తీశాడు, అందులో మరో చిన్న అర లాగాడు.

కరెన్సీ నోట్లు కన్పించాయి.

రామనాథం గుండె దడదడ లాడింది.

కాళ్ళూ చేతులు వణకసాగాయి.

ముఖమంతా చెమట్లు పట్టింది.

రామనాథం చివాల్న పైకి లేచాడు. దయందయంగా గుమ్మంకేసి చూశాడు. కాసేపు మళ్ళీ పచార్లు చేశాడు. చివరకు గుండె రాయి చేసుకున్నాడు. చెమట్లు తుడుచుకున్నాడు. బీరువా దగ్గర కెళ్ళాడు. రెండువందల యాభైరూపాయలు తీసుకున్నాడు. ఆఫీసుకు సంబంధించినంతవరకూ తెలిసి చేస్తున్న మొదటి తప్పు ఇదే అనుకున్నాడు. వెంటనే సీనియర్ యు. డి. సి. మోహనరావును పిల్చాడు. రామనాథానికి ఉద్యోగరీత్యా పరిచయమై మంచి స్నేహితులుగా నిల్చిన కొద్దిమందిలో మోహనరావు ఒకడు. రామనాథం మోహనరావులు నాలుగైదు కేంద్రాల్లో కలిసి పనిచేశారు. మోహనరావుకి రామనాథం అంటె చాలా గౌరవం, ప్రేమాభిమానం.

ఆఫీసు డబ్బు తీసుకుంటున్న విషయం మినహాయించి మిగిలిన వివరాలు చెప్పాడు. మోహనరావు చాలా విచారపడ్డాడు. రామనాథంకు ఎలాంటి కష్టమొచ్చినప్పుడు పరితాపం చెందుతూ మనస్ఫూర్తిగా సానుభూతి తెలిపేవారిలో మోహనరావు ప్రప్రథముడు. ముఖ్యమైన అర్జంట్ ఫైల్స్ కొన్ని అప్పగించి మూడురోజులు క్యాజువల్ లీవు రాసి కాగితం మోహనరావుకు అందించాడు. రామనాథం దైన్యరూపాన్ని ప్రత్యక్షంగా వుండి చూస్తున్న మోహనరావుకు ఏడుపు మాత్రమే తక్కువైంది.

వందరూపాయలు ఖాతరికి, డెబ్బై రూపాయలు కొడుక్కి టెలిగ్రాం మనియార్డర్లు చేయమని డబ్బు మోహనరావు చేతిలోపెట్టి సైకిల్‌పై హడావుడిగా హాస్పిటల్‌వేపు బయల్దేరాడు రామనాథం. ఆయన వెళుతున్నవేపే చూస్తూ నుంచున్నాడు మోహనరావు. ఉద్యోగిగా రామనాథాన్ని గురించిన ఆలోచనలు అతని మనసులో మెదిలాయి.

రామనాథం సర్వీసు యిప్పటికి సుమారు ఇరవైరెండు సంవత్సరాలు. తాను సర్వీస్‌లో చేరిన పన్నెండు సంవత్సరాలనుంచీ రామనాథాన్ని బాగా చదువుకొని ఎన్నో విషయాలు తెలుసుకున్నాడు.

రామనాథం ఒళ్ళు వంచి పనిచేస్తాడు. ఉద్యోగంలో వున్నంతవరకూ తానో గవర్నమెంటు జీతగాడన్నవిషయాన్ని అనుక్షణం గుర్తుంచుకుంటాడు అలాగే పని చేస్తాడు. ఇతర ఉద్యోగులుకూడా అలావుండాలంటాడు తనలా నడవాలంటాడు. తన సిద్ధాంతాలకి వ్యతిరేకంగా నడిచేవారిని కుండ బద్దలు కొట్టినట్లు మాట్లాడి మందలించడానికి ఏమాత్రం భయపడడు.

సహృదయుల దృష్టిలో ఆయన మంచి మనిషనిపించుకుంటె — పై అధికారుల దృష్టిలో చురుకైనవాడు, సిన్సియర్ వర్కర్, సమర్థుడూనా వారి మనసులో చోటు చేసుకుంటే — బల్లక్రింద చేతులు చాపి అడ్డమైన గడ్డిగాదాన్ని పోగు చేసుకు తింటూ ఆత్మాభిమానాన్ని కోల్పోయే అసమర్థులదృష్టిలో అతనో తెలివితక్కువ వాడుగా, బ్రతక నేర్వని బుద్ధిహీనుడిలా తనకు చేతకానిదాన్ని మరొకడుచేసి బ్రతుకుతుంటే చూసి సహించలేని ఓర్వలేనివాడుగా మిగిలిపోయాడు.

రామనాథాన్ని ఎంత అధ్వాన్నమైన ఆఫీసులో వేసినా అతిత్వరలో ఉత్తమమైనదిగా చేసుకుని మంచిపేరు గడిస్తుందన్న రహస్యం మనసులో గీతారహస్యం కంటే మిన్నగా ఏర్పడిపోయింది.

అందుకే పై అధికార్లకు రామనాథమంటే వల్లమాలిన అభిమానం. ఆ అభిమానాన్ని పురస్కరించుకొని అధికార్ల

రాముణ్ని ఉత్తరాలు డైరెక్టరాఫీసుకు బాణాల్లా వదిలారో పాపం! రామనాథానికేం తెలుసు?

ఈ డైరెక్టరుగారు నాలుగేళ్ల క్రితం ప్రమోషన్ మీద బదిలీ అయి వచ్చాడు. అనకతవగా పనిచేసే ఆఫీసరుకు ఈయన పేరు చెపితే హడల్! అంతటి స్ట్రిక్టు మనిషాయన. అందుకని ఆయనంటే రామనాథానికెంతో ఇష్టం. డిపార్టుమెంటల్‌గా ఆఫీసుకి సంబంధించినంత వరకూ ఏ విషయంలోనూ ఏ మాత్రం భయపడని బహు కొద్ది మందిలో రామనాథం ఒకడు.

ఈ ఆఫీసుకు విజిట్‌కిగానీ ఇన్‌స్పెక్షన్‌కిగానీ వస్తున్నాడంటే చిరునవ్వుతో సగర్వంగా స్వాగతం చెప్పే రామనాథం ఇప్పుడాయనను చూసి గజగజ వణికి పోతున్నాడు.

డైరెక్టరుగారు తిన్నగా గదిలోకి అడుగు పెట్టాడు. రామనాథం వణుకుతున్న తన రెండు చేతుల్నీ జోడించాడు, అభివాద సూచకంగా. డైరెక్టరుగారు తిన్నగా వెళ్లి రామనాథం సీట్లో కూర్చున్నాడు. కొద్ది సెకండ్ల అనంతరం రహస్యాన్ని ఛేదించడానికి వచ్చిన పత్తేదారులా...

'క్యాష్‌బుక్కు తెప్పించండి!' అన్నాడు డైరెక్టరు స్వచ్ఛమైన తెలుగులో.

రామనాథం కొయ్యబారి పోయాడు.

'మిమ్మల్నే! క్యాష్‌బుక్కు తెమ్మంటున్నాను'

రామనాథం వైఖరిని గమనించి కొంచెం ఆశ్చర్యపోయారు డైరెక్టరుగారు. హఠాత్తుగా ఆయన మస్తిష్కంలో ఏదో అనుమానం తళుక్కున మెరిసింది. వేచి చూద్దామనుకున్నాడు.

రామనాథం క్యాష్‌బుక్కు తెచ్చి డైరెక్టరు ముందర పెట్టాడు. ఆయన క్యాష్‌బుక్కు ప్రకారం వుండవలసిన బ్యాలెన్సు చూసి క్యాష్ పెట్టమన్నాడు. రామనాథానికి ముచ్చెమటలు పట్టాయి. ఆయన గుండె కొట్టుకొనే మోత ఆయనకే వినబడసాగింది. బీరువా తెరచి క్యాష్‌బాక్సు పట్టుకొచ్చాడు. అప్పటి రామనాథం స్థితిని మాటల్లో వర్ణించడం దుస్తరం.


డైరెక్టరుగారు స్వయంగా క్యాష్ లెక్క పెట్టారు. ఒక్కసారిగా గతుక్కుమని 'వ్వాట్ రామనాథం మిగతా డబ్బు?' ఆశ్చర్యచకితుడై అన్నారాయన.

రామనాథం అబద్ధం చెప్పలేక పోయాడు.

'సార్! తప్పు చేశాను క్షమించండి! ఈ డబ్బు దుర్వినియోగం చేయడానికి కాదు నేను వాడుకున్నది. యూనివర్శిటీలో తిండిలేక అవస్థలు పడుతున్న నా కొడుకుని ఆదుకోడానికి, లారీ ప్రమాదంలో గాయపడి హాస్పిటల్‌పాలైన నా అల్లుడిని రక్షించు

"పిల్లల ఆరోగ్యమే పెద్దలకు ఆనందము"

బహోల గ్రైప్ మిక్చర్




పసిపాపలకు, పిల్లలకును
చాల మంచిది. ప్రఖ్యాతి చెందిన
'కేమొమిల్లా' అను
హోమియోపతి
ఔషధము గల
గ్రైప్ మిక్చర్
యిది ఒక్కటే

వెల రు. 1-50

BAHOLA PHARMACEUTICALS COMPANY
KUMBAKONAM (S. INDIA).
BRANCHES AT: MADRAS, BANGALORE CITY & CONTONMENT, COCHIN, MADURAI AND SALEM

Agents for Andhra Pradesh M/s PRAGATHI AGENCIES, Vijayawada-1.

కాని నా కూతురు కమల మాంగల్యాన్ని కాపాడుకోటానికి నాభార్య...'

'నా కవన్నీ అనవసరం' రామనాథం మాటల్ని మధ్యలోనే తుంచివేసి తీక్షణంగా చూస్తూ కర్కశంగా అన్నారు డైరెక్టరుగారు.

రామనాథం నోరు మెదల్పలేక తల దించుకొని నేలమాపులు చూస్తూ నిల్చుండి పోయాడు. డైరెక్టరుగారు టేబులు మీదున్న తెల్లకాగితాన్ని తీసి దానిమీద

# అపరాధి

బరబరా గీకేయడం ప్రారంభించారు. డైరెక్టరుగారు ఏం రాస్తున్నారోనని విపరీతమైన భయాందోళనలతో తన దృష్టిని కాగితం మీదను మళ్లించాడు రామనాథం. కన్నీటి పొరల్లోంచి కొట్టొచ్చినట్లు ఆయనకు అగుపించిన అక్షరాలు—

'హి ఈజ్ సస్పెండెట్ అన్టిల్ ఫర్దర్ ఆర్డర్సు'

హఠాత్తుగా రామనాథం డైరెక్టరుగారి దగ్గరకు వెళ్లి 'అయ్యా ఈ ఒక్కసారికి క్షమించండి. ఈ డబ్బును దుర్వినియోగం చేయడానిక్కాదు నేను వాడుకున్నది, నా కుటుంబానికొచ్చిన ఆపదల్ని తట్టుకునేందుకు వేరే గత్యంతరంలేక వాడుకున్నాను. ఒకగంట టైమివ్వండి డబ్బు తెస్తాను. పిల్లలుగల వాణ్ని నా పొట్ట గొట్టకండి. నా కన్యాయం చేయకండి. మీ పాదాలు పుచ్చుకుంటాను' కన్నీళ్లు జలజలా కారిపోతుండగా డైరెక్టరుగారి కాళ్లమీద పడబోయాడు రామనాథం,

డైరెక్టరుగారు అసహ్యంతో నివాళ్ళి సీటులోంచి లేచి 'నిన్ను గురించి విన్నవన్నీ అబద్దాలు కావని రుజువు చేశావ్' అంటూ విసురుగా అవతల గుమ్మం దగ్గరగా వెళ్లి నిల్చున్నారు.

క్యాష్‌బాక్సుకి సీళ్ళువేసే కార్యక్రమం జరుగుతోంది.

రామనాథంమీద ఛార్జిస్ ఫ్రేము చేసి డిపార్టుమెంటల్‌గా అతనిమీద తగినచర్య తీసుకోవాలని తీర్మానించబడింది. కాని అవి రామనాథాన్నేమీ చేయలేకపోయాయి.

*　　*　　*

ఆ వూళ్ళో రామనాథం ఎవరో గుర్తు పట్టడం పెద్ద కష్టం కాదు – దుమ్ము కొట్టుకుపోయి చిరిగి పేలికలైపోయిన పంచె, అలాంటిదే చొక్కా, ఇంతబారున పెరిగిపోయిన గడ్డం, అంటలు గట్టుకు పోయిన జుట్టు, లోతుకు పీక్కుపోయిన కండ్లూ, ఈ ఆకారంలోవుండి వీధుల్లో ఆఫీసరు దుస్తుల్లో అగుపించిన ప్రతివారి దగ్గరకి పరుగు పరుగున వెళ్ళి ఎంతో వినయంగా వంగి—

'అయ్యా! ఈ ఒక్కసారి క్షమించండి. ఈ డబ్బు దుర్వినియోగం చేయడానిక్కాదు నేను వాడుకున్నది. నా కుటుంబాని కొచ్చిన ఆపదల్ని తట్టుకునేందుకు వేరే గత్యంతరం లేక వాడుకున్నాను. ఒక్కగంట టైమివ్వండి డబ్బు తెస్తాను. పిల్లలుగలవాణ్ని అన్యాయం చేయకండి. నా పొట్టగొట్టకండి మీపాదాలు పుచ్చుకుంటాను' అని కన్నీళ్లతో ప్రాధేయ పడే వ్యక్తి ఎవరైనా వుంటే అతనే రామనాథం. ●

# ప్రొ॥ కె. ఎస్. జి. దాస్.



1958—67 లో సెంట్రల్ ఎలక్ట్రో కెమికల్ రిసర్చి ఇన్‌స్టిట్యూట్ కరైకూడి) డైరెక్టర్‌గా పని చేసిన ప్రొ. కె. ఎస్. జి. దాస్, విద్యుత్ రసాయన శాస్త్రం, చక్కెర టెక్నాలజీ వంటి రంగాల్లో అంతర్జాతీయ ఖ్యాతి గడించిన శాస్త్రవేత్త. వీరు ప్రస్తుతం ఇండియా సిమెంట్సు అనే సంస్థకి సాంకేతిక సలహాదారుగా ఉంటున్నారు. ప్రొ. దాస్ భౌతిక రసాయన శాస్త్రంలో కనిపెట్టిన అనేక కొత్త విషయాలు పరిశ్రమల్లో చాలా ఉపయోగ పడుతున్నాయి. వీటి ఫలితంగా మన దేశానికి సాలీనా దాదాపు కోటి రూపాయల విదేశ మారక ద్రవ్యం ఆదా అవుతోంది. వాటిని గుర్తించి 1966 లో ఇన్‌వెన్షన్సు ప్రమోషన్ బోర్డు వారు ప్రొ దాస్‌కి 5000 రూ.లు నగదు (ప్రథమ) బహుమానం ఇచ్చారు. ఇంతే కాకుండా వీరికి ఇంకా అనేక ఇతర బహుమానాలు సన్మానాలు లభించాయి.

కదరుండలిగె సీతారామదాస్ గురురాజ దాస్, నాగమంగళ (మైసూర్ జిల్లా) అనే వూళ్ళో 1906 లో పుట్టారు. బి. ఎస్. సి, ఎం. ఎస్. సి. డిగ్రీలు మైసూర్ యూనివర్శిటీలో ఫస్టుక్లాస్, ఫస్టురాంక్‌లో తీసుకున్నారు. డి. ఎస్. సి. డిగ్రీ మద్రాస్ యూనివర్శిటీలో పుచ్చుకున్నారు. కొంత కాలం కాన్పూర్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సుగర్ టెక్నాలజీకి డైరెక్టర్‌గా పని చేశారు. వారి ప్రచురణలు 160 ఉన్నాయి.

ప్రొ. దాస్‌కి చాలా అంతర్జాతీయ వైజ్ఞానిక సంస్థల్లో సభ్యత్వం ఉంది. ఇంటర్నేషనల్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రోకెమికల్ థర్మోడైనమిక్సు అండ్ కైనటిక్సు అనే సంస్థకి ఉపాధ్యక్షులు. 1966 లో మాస్కోలో, మెటాలిక్ కరోజన్ (లోహాలు అరిగిపోవడం) గురించి జరిగిన అంతర్జాతీయ సమావేశానికి, ప్రొ. దాస్ గౌరవ ఉపాధ్యక్షులు. చాలా అంతర్జాతీయ వైజ్ఞానిక పత్రికలకీ, గ్రంథ రచనలకీ వీరు సంపాదక వర్గ సభ్యులు, సలహాదారు. భారతవైజ్ఞానిక సంస్థలు కూడా వారిని బహువిధాల సత్కరించాయి. ఫెలో గానూ, అధ్యక్షులు గానూ, ఉపాధ్యక్షులు గానూ ఎన్నుకున్నాయి.

ప్రొ. దాస్ రష్యా, జపాన్, యూరోపియన్ దేశాల్లో విస్తారంగా పర్యటించారు. దాస్ దంపతులకి ఇద్దరు కుమార్తెలూ ఆరుగురు కొడుకులూ.

—డా॥ ఆర్. ఎల్. ఎస్. శాస్త్రి.